# మచ్చిక

**మే**కకి స్నానం చేయిస్తున్నారు పెరట్లో సిద్ధూ, "నేనూ చేయిస్తా"నని హడావిడి చేస్తున్నాడు ఎప్పట్లా! అప్పుడప్పుడు ఎనిమిదేళ్ళ సిద్ధూ దానికి స్నానం చేయిస్తానని గొడవ చేయడం, వాడికి సహాయంగా వాడి బాబయ్య సుధాకర్ వెళ్తూ ఉండడం మామూలే. కాని ఇవాళ సుధాకర్ నిస్సహాయుడిలా దూరంగా ఉండిపోయాడు పెరట్లో జరుగుతున్న గొడవ వినిపిస్తున్నా సిద్ధూ తండ్రి రమణమూర్తి వాడిని ఇంట్లోకి పొమ్మని కసురుకొంటున్నాడు. అతనికి సహాయంగా రమణమూర్తి బావమరిది చంద్రశేఖర్ నిలబడ్డాడు.

"ఒరేయ్ సుధాకర్ వచ్చి సిద్ధూగాడిని తీసుకువెళ్ళు" అని రమణమూర్తి అధికార పూర్వకంగా అరిచాడు.

సుధాకర్‌కి పెరట్లోకి వెళ్ళక తప్పలేదు. పెరట్లో ఇంటికి ఆనుకుని మునిసిపల్ కొళాయి ఉంది. పెరటి గోడ దగ్గరగా బాదం చెట్టు పక్కన బావి ఉంది. ఆ బావి దగ్గర మేకకి రమణమూర్తి, చంద్రశేఖర్‌లు స్నానం చేయిస్తుంటే పక్కన సిద్ధూ సబ్బు పట్టుకొని నిలబడి గొడవ చేస్తున్నారు.

మేక 'మే మే' అని అరుస్తోంది. అది ఎప్పట్లా ఆట అనుకుంటోందేమో! సుధాకర్‌ని చూడగానే గెంతడానికి ప్రయత్నించబోయింది. చంద్రశేఖర్ బలమైన హస్తాలలో అది బందీ అయిపోయి ఉండడం వల్ల కుదరలేదు. అది తల్లి దగ్గర పాలు తాగే రోజుల్నించి తనూ, సిద్ధూ దాంతో ఆటలాడుకున్నారు. దాన్ని ఆటలు పట్టించేవారు – కొన్ని సార్లు దానిని తల్లి పొదుగు అందకుండా చేస్తూ, చివరికి వీళ్ళు, దాన్ని తల్లి పొదుగు దగ్గర వదిలిపెడ్తారని దానికీ తెలిసేది. అది పాలు తాగాక వీళ్ళకి చిక్కకుండా చెంగు చెంగున గెంతుతూ దొడ్డంతా పరిగెత్తేది. కాని అదిప్పుడు పెద్దదై బలంగా తయారైంది. నల్లగా కండపట్టి నిగనిగలాడ్తోంది. ఇవాళ చేసే స్నానం దాని చివరి స్నానం. స్నానం చేసాక వెయ్యడానికి పూలు, వేపమండలు జల్లడానికి పసుపు, కుంకుమ సిద్ధంగా ఉన్నాయి.

సిద్ధూకి సిద్ధార్థ అని పేరుపెట్టాలని అన్న రమణమూర్తికి, వదిన పద్మకి సుధాకరే సూచించాడు. బుద్ధుడు దయామయుడు. సుధాకర్ పదేళ్ళ క్రితం అహింస పరమధర్మం కింద తోచేది. రమణమూర్తి నవ్వేవాడు. మాంసం తినడానికి ఇష్టపడని సుధాకర్‌తో ఒకసారి, "ఒరేయి సుధాకర్! మీ బుద్ధుడు మాంసం తినేవాడు తెల్సా?" అని అడిగాడు.

సుధాకర్ అన్న కేసి బిత్తరపోయి చూసాడు.

"అహింస అంటే అనవసరపు హింస అని అర్థంరా! మొక్కలు మాత్రమే జీవరహిత పదార్థాలను నేరుగా తీసుకుని జీవకణాలని పెంచుకోగలవు. మిగిలిన అన్ని జీవుల మనుగడ తమకందుబాటులోను, తమకి అరిగే జీవ పదార్థాలను తిని ఆరగించుకోవడంలోనే ఉంది. పాలు, వెన్న పెరుగు శాఖాహారాలు కావు. వంకాయని ఉడికించినప్పుడు దాని జీవకణాలు కుతకుత ఉడికి గిలగిల కొట్టుకొని చచ్చిపోతాయి. నువ్వు ఏంటీ బయోటిక్స్ వేసుకున్నావనుకో, నీలోని సూక్ష్మజీవులు రోగాన్ని కలిగించేవి, కలిగించనివి కూడా చచ్చిపోతాయి. దోమని ఆలోచించకుండా చంపుతాం. బొద్దింకను ఆలోచించి చంపుతాం. ఎలుకని విషం పెట్టి దూరంగా పోయి చచ్చిపోయేలా చేస్తాం. అంటే హింస మన కళ్లకి కనబడకూడదు. మూతికి, ముక్కుకి గుడ్డలు కట్టుకొనే వారు కూడా జీవపదార్థాలు తినే బతుకుతారు" - అంటూ రమణమూర్తి తమ్ముడికి బోధించాడు.

అందుకే సుధాకర్‌కి అన్న అంటే గౌరవం. అన్నింటిని హేతుబద్ధంగా వివరిస్తాడు. అన్న పిలవగానే సుధాకర్ వెళ్ళి సిద్ధూని బావి దగ్గర నుంచి బలవంతంగా ఎత్తుకొని, గదిలో పడుకున్న వదిన దగ్గరకు తీసుకువెళ్ళాడు.

వదిన పద్మ. పెళ్ళికి బంగారపు బొమ్మలా ఉండేది. సిద్ధూ పుట్టాక కొంత, ఇంటి పనితో కొంత చిక్కింది. ఆరునెల్ల క్రితం పురుటిలో పసికందును పోగొట్టుకుని జబ్బుపడ్డ ఆమె కోలుకోడానికి ఆరు నెలలు పట్టింది. ఆమె ఇప్పుడు బంగారపు తీగెలా ఉంది. అన్నయ్యకి వదిన కాలేజీలో స్టూడెంట్. ఆమె అందానికి, మంచి నడతకి, మెత్తని మాటకి, రమణమూర్తి ఆకర్షితుడయ్యాడు. ఆ పెళ్ళి విషయంలో ఇంట్లో జరిగిన హడావిడి సుధాకర్‌కింకా గుర్తుంది.

పద్మ, రమణమూర్తి కులాల్లో చిన్న తేడా ఉంది.

"మాంసాహారులు, అమాంసాహారులు అని రెండే కులాలు. మిగిలిన కులాలు కులాలు కావు. అవి వృత్తులు" అని వాదించాడు రమణమూర్తి.

"వెజిటేరియన్స్, నాన్ వెజిటేరియన్ కులాలా?" అని అడిగాడు సుధాకర్.

"ఇండియాలో ఉన్న వారిని ముస్లిమ్స్, నాన్ ముస్లిమ్స్ అని చెప్పడం ఎంత తమాషాగా ఉంటుందో అలాగే మెజారిటీ మాంసాహారులని నాన్ వెజిటేరియన్స్ అనడం అంత హాస్యాస్పదంగానే ఉంటుంది. మనకి, వాళ్ళకి ఏమీ చెప్పుకోతగ్గ తేడా లేదు" అని తన ఇంట్లో చెప్పి ఆడపిల్లవారు వచ్చి పిల్లనిస్తామని చెప్పాలన్న ఆనవాయితీ గురించి పట్టించుకోకుండా వాళ్ళింటికి వెళ్ళి పిల్లనిమ్మని అడిగాడు.

ముందర సణిగినా చివరికి అందరూ ఒప్పుకున్నారు. పద్మ చక్కనిదే కాదు. బుద్ధిమంతురాలు, అనురాగవతీ కూడా అవటం వల్ల అత్తింటివారందరి అభిమానం సంపాదించింది. ముఖ్యంగా మరిది సుధాకర్‌కి ఈమె అంటే చాలా ఇష్టం. అన్నయ్య తెలివి తేటలకి, ఆమె మంచి తనానికి సమానమైన జోడీ అనుకుంటాడు. మొదటి

కాన్పులోనే కొడుకుని కని అత్తమావల్ని అందలమెక్కించింది. తొమ్మిదో నెల వరకు పుట్టింటికి వెళ్ళక, మూడో నెలకే తిరిగి వచ్చేసింది. సుధాకర్ ఆ పిల్లాడికి సిద్ధార్థ అని పేరు సూచిస్తే ఆ పేరు సున్నిత మనస్కుడి పేరని అదే పెట్టమని భర్తతో చెప్పింది.

అటువంటి పద్మ రెండో కాన్పులో బిడ్డను పోగొట్టుకొని జబ్బు పడింది. కోడలు మళ్ళీ లక్ష్మీదేవిలాగా తిరగాడితే మేకని బలిస్తామని అత్తమొక్కుకుంది. ఇప్పుడామొక్కే తీర్చబోతున్నారు. జంతుబలుల పట్ల సుధాకర్‌కి సద్భావం లేదు. అది క్రూరమూ, అనాగరకమూ, మూఢ విశ్వాసమూ అని అతని నమ్మకం. దాన్ని రమణ మూర్తి ఖండించాడు.

"చిల్లీ చికెన్, మటన్ బిర్యానీ తింటాం కదా! కంచంలోకి అవి వస్తున్నాయంటే వాటిని ఎక్కడో చంపి ఆ మాంసం తీసుకువచ్చారన్నమాటే! చంపడం ఎక్కడ జరిగిందన్నది ప్రశ్న. ఇల్లా? గుడా? వధ్యస్థానమా? చాలా మందికి తినడానికి అభ్యంతరం ఉండదు కాని ఇంట్లో చంపడం ఇష్టం ఉండదు. అందుకని షాపుకు వెళ్ళి తెచ్చుకోవడమో, నౌకర్ని పంపి తెప్పించుకోడమో చేస్తారు.

ఇదొరకం హిపోక్రసీ. నా స్నేహితుడొకడు స్లాటర్ హౌస్ టెక్నాలజీ చదివాడు. అతను నాకు చెప్పేవాడు. 'తెల్లవాళ్ళ దేశాల్లో జంతువు తల వంచి ఉన్నప్పుడు బలమైన కొయ్యగదతో పైనుంచి మోదుతారుట. అప్పుడది స్పృహ తప్పి పడిపోతుందిట. అప్పుడు దాని తల, మొండెం వేరుచేస్తారుట. చావుని స్పృహతో అనుభవిస్తే సెల్స్ విషపూరితం అవుతాయిట. అందుచేత బ్లీడింగ్ ఏన్ ఎనిమల్ టు డెత్, దాని మాంసం క్వాలిటీ దృష్ట్యా, అవాంఛనీయం' అనేవాడు. చంపకుండా తినలేము అన్నది గుర్తించాక ఇల్లు కాక మిగిలినవి గుడీ, స్లాటర్ హౌసూ. గుడిలో చంపడం థాంక్స్ గివింగ్ నాడు టర్కీని చంపడంలాంటిదే. రెండోది మూఢ నమ్మకం అయితే మొదటిదీ అవును. పేరేదైనా చంపినదాన్ని తింటారు కాని వేస్టు చెయ్యరు కదా! అందుకని అది అహింసే" అన్నాడు రమణమూర్తి.

"బలి వెయ్యటంలో క్రూరత్వం లేదా?" అని అడిగాడు సుధాకర్.

"బలి వేసే చోట సాధారణంగా ఒక్క వేటుతో జంతువు తల తెగవేస్తారు. అది చావుని అనుభవించదు కనక క్రూరత్వం కాదు"

"అంతమంది చూస్తూ ఉండగా చంపడం అనాగరికం కాదా?"

"యుద్ధంలోను, ఉరి తీసినప్పుడు, బుల్‌ఫైట్‌లోను చాలా చోట్ల వధ చాలా మంది కళ్ళ ముందరే జరుగుతుంది. చూడలేని వారు రారు. ఏక్సిడెంటయి రక్తం కార్తున్న వారిని చాలామంది సహాయం చేసేందుకు కాక చూసేందుకు వెళ్తారు. మనిషిలో వున్న ఆ వేట ప్రవృత్తి వల్ల రక్తం చూడడానికి కొందరు ఇష్టపడ్తారు. వేట లేని ఈ రోజుల్లో ఫుట్‌బాల్ ఆట, బాక్సింగ్‌లు చూడడానికి జనం వెళ్తున్నారు 'అంటాడు బర్ట్రాండ్ రస్సెల్."

"నేను ఆ రక్తం చూడడానికి ఇష్టపడను"– సుధాకర్ నమ్మకంతో చెప్పాడు.

"నువ్వు చూడకుండా ఉండాలంటే కుదరవచ్చు. డాక్టర్లకి, నాలాంటి జువాలజీ చదువుకొన్నవారికి కుదురుతుందా? పైగా నీకు చూడడం ఇష్టం లేకపోవచ్చు. కష్టం కాకుండా చూసుకో! మగవాడిని చావు, రక్తం భయపెట్టరాదు. క్షతగాత్రుల్ని, శవాలని మొయ్యాల్సి రావచ్చు. శ్మశానంలోకి వెళ్ళకుండా ఏ మగవాడికీ కుదరదు. కొంత ఇన్‌సెన్సిటివ్‌నెస్ పెంచుకోకపోతే నువ్వు సమాజానికి ఉపయోగపడవు.

సుధాకర్‌ని, రమణమూర్తి గుడికి వచ్చేలా ఒప్పించాడు. తనతో సుధాకర్ కూడా గుడికి వస్తుంటే మేక షికారుకి వెళ్తున్నంత ఉత్సాహంగా అతని పక్కనే నడవసాగింది. అతను చాలా అపరాధ భావనతో దానికి దూరంగా తప్పించుకుని నడవటం మొదలు పెట్టాడు. దాని ఆలోచనల గురించి సుధాకర్ దారి పొడుగునా ఆలోచించసాగాడు.

పక్కనుంచి తల్లకిందులుగా వేళ్లాడదీసిన కోళ్ళ నెన్నింటినో ఎవరో సైకిల్ మీద తీసుకువెళ్ళారు. 'ఇది హింసా?' అన్నయ్య ఏమంటాడో! లారీల్లో పశువుల్ని చాలా ఘోరంగా కుక్కి తీసుకువెళ్ళటం, నడవలేని పశువుల గాయాలకి కారం తగిలించి నడిపించటం గురించి సుధాకర్ చదివాడు. చంపడానికి తీసుకువెళ్ళేవాటిని హింసిస్తూ తీసుకువెళ్ళకపోతే కుదరదా! కిక్కిరిసిన రైళ్ళల్లోను, బస్సుల్లోను, మనుష్యులు ప్రయాణం చేయటం; ఇంక్రిమెంట్లివ్వక, ఒక్కోసారి వేతనాలే ఇవ్వక, ఎన్నో గంటలు పని చేయించుకోవటం; ఆడవాళ్ళని లైంగికంగా వేధించడం; బాల కార్మికుల్ని టెంకె జెల్లెల తోను తన్నులతోను పనిచేయించటం కూడా హింసతో కూడినవే! మనుష్యులనుభవించే హింసకే దిక్కులేదు. పశుపక్ష్యాదుల హింసకి చలించే అంత సున్నిత మనస్తత్వం వేరే పనిలేని గొప్పింటి వారికి మాత్రమే చెల్లుతుందంటాడు అన్నయ్య.

సుధాకర్ ఆలోచిస్తుండగానే జనం గుడికి చేరారు మేకతోసహా! పూజ జరిగింది. బలివేసే వేళకి మేక మెల్లిగా సుధాకర్ దగ్గరకు చేరి ఉంది. సుధాకర్‌ని కూడా మేక మెడకి వేసిన తాడు లాగి పట్టుకొమ్మన్నారు. సుధాకర్ సహాయం చెయ్యలేకపోవటమే కాకుండా ముఖం తిప్పేసుకొన్నాడు. ఒక్క వేటుతో దాని మెడ తెగి అవతల పడింది. కాస్సేపు మొండెం గిలగిలా కొట్టుకొని నిలిచిపోయింది.

'నొప్పి అనుభవించే తల కదలదు. నొప్పి తెలియని మొండెం ఎగిరెగిరి పడుతుంది. అదే తమాషా' అంటాడు రమణ మూర్తి. సుధాకర్‌కి అది తమాషాగా కాక ఒక బాధగా అనిపించింది. ఆ రోజు తరువాత సుధాకర్ చాలా రోజుల వరకు మనిషి కాలేకపోయాడు. సిద్ధూ కూడా మేక కోసం బెంగపెట్టుకున్నాడు కొద్దిరోజులు.

అన్నయ్య చెప్పేవాటిలో అసత్యం లేకపోయినా అందులో ఏదో అసంబద్ధత ఉందని సుధాకర్‌కి అనిపించసాగింది. అన్నయ్య చెప్పే మాటలు పూర్వం లాగానే వింటున్నా ఆ

విషయాల గురించి తనుగా ఆలోచిస్తున్నాడు, చదువుతున్నాడు.

బలి జరిగిన అయిదేళ్ళకి రమణమూర్తి మరో స్త్రీతో తిరుగుతున్నట్టు పుకార్లు కర్ణాకర్ణిగా వ్యాపించాయి. మరో సంవత్సరానికి అదిపుకారు కాదని, నిజమేనని రూఢి అయింది.

వదిన పద్మ పురిట్లో బిడ్డతోసాటు తాను పోనందుకు బాధ వ్యక్తంచేసే స్థాయికి వచ్చేసరికి అన్నయ్య మొండికేశాడు. సిద్ధూ అమ్మా నాన్నల మధ్య జరిగే గొడవలకి బెంగటిల్లసాగాడు.

సుధాకర్‌కి అన్నయ్య ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది. ఎంతో హేతుబద్ధంగా ఆలోచించే అన్నయ్య ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడో అతనికి అర్థం కాలేదు. రేషనలిస్టులు, రైషనలైజేషనిస్టులు అని కాలేజీలు ఎవరో ఒకసారి పాడగా విన్నాడు. రేషనలిస్టులు హేతువాదులు కాగా, రేషనలైజేషనలిస్టుల గురించి చెప్పినతను "చేసే పనులకు నప్పే థీయరీలు చెప్పేవారు" అని నిర్వచించడం గుర్తు వచ్చింది. వాళ్ళు ఏం చెయ్యాలో ముందు నిర్ణయించుకుని ఎందుకు చెయ్యాలో తర్వాత ఆలోచిస్తారుట. అన్నయ్య అటువంటివాడా!?

మధనపడ్తున్న సుధాకర్‌కి ఆ ఊరికి కేబుల్ టి.వి.రావటం వరంలా పరిణమించింది. డిస్కవరీ ఛానెల్, నేషనల్ జియోగ్రఫీ ఛానెల్స్ చూస్తూ జ్ఞానం పెంచుకోసాగాడు.

ఒక రోజున ఆఫ్రికా అడవుల గురించి చూపిస్తున్నారు టివిలో. జింకలు నీటికి దగ్గర గడ్డి మేస్తూ, నీరు తాగుతూ నిశ్చింతంగా తిరుగుతున్నాయి. వాటికి కొద్ది దూరంలో సింహాలు విశ్రాంతి తీసుకుంటున్నాయి. జింకలు వాటిని పట్టించుకోకపోవడం ఆశ్చర్యంగా చూస్తున్నాడు సుధాకర్.

కామెంటేటర్ చెపుతున్నాడు. "సింహాలు ఆకలి తీరాక వేటాడవు. ఆకలి వేసినప్పుడు మాత్రమే వేటాడ్తాయి. అవి వేటకి లేచాక జింకలు ప్రాణ రక్షణలో పడ్తాయి"

సింహాలు లేచి లేళ్ళ వెంట పరిగెత్తడం మొదలుపెట్టాయి.

"అవి ఆహారం దొరికే వరకో, అలసిపోయేవరకో లేళ్ళని వెంట తరుముతాయి. కొన్నిసార్లు లేళ్ళు వాటికి అందకుండా పోతాయి. ఆకలితో, అలసటతో అవి వేటమానేస్తాయి. లేళ్ళు మళ్ళీ నిర్భయంగా సంచరించడం మొదలుపెడతాయి".

"వేటాడే జంతువులకి వేటాడాల్సిన అవసరం ఉన్నట్టే, అడవుల్లో వేటాడబడే జంతువులుకి ప్రాణరక్షణకి అవకాశం ఉంది".

"మనిషి ఒకప్పుడు వేటగాడే కాని ఈ రోజున జంతువును మచ్చిక చేసుకోటం ద్వారా, దాన్ని రక్షించుకొనే అవకాశం దానికి లేకుండా చేస్తున్నాడు. మచ్చిక చేసుకోవటంలో నమ్మించడం ఉంది. నమ్మించి ద్రోహం చేస్తున్నాడు. క్రూరత్వం నమ్మక ద్రోహంలో ఉంది. ఒక ప్రాణి తన్ను తాను రక్షించుకోడానికి చెయ్యగల ప్రయత్నానికి అవకాశం లేకుండా చెయ్యడమే నిజమైన హింస. సున్నితత్వాన్ని క్రమేపి మనిషి పోగొట్టుకొంటూ పోయి రేషనలైజేషనిస్టు అయిపోతున్నాడు.

"నేను అమాయకమైన అమ్మాయిల్ని తీసుకొనిపోయి బోగం కొంపలకి అమ్మటం లేదు. అందులో ఉన్న వాళ్ళ దగ్గరకే నే వెళ్తున్నాను. నేను కాకపోతే మరొకళ్ళు వెళ్తారు ఎవరం వెళ్ళకపోతే వాళ్ళు మలమల మాడిపోతారు" అన్నాడోసారి సానికొంపలకి వెళ్ళే స్నేహితుడు సుధాకర్‌తో.

బోగం కొంపలకి చేరే ఆడపిల్లల్ని ఎవరో మచ్చిక చేసుకుని నమ్మించి, అక్కడకి చేర్చకపోతే వాళ్ళంతట వాళ్ళే అక్కడికి చేరుకుని ఉంటారా? వాళ్ళని వాళ్ళు రక్షించుకొనే అవకాశం అక్కడ వాళ్ళకుంటుందా! హింసంతా మచ్చిక చేసుకోవడంలోనే ఉంది.

సర్కస్‌లో మృగాల నాడించటం మాత్రమే హింస కాదు. మచ్చిక చేసుకుని పశు పక్ష్యాదులను పెంచుకోవడంలోనూ ఉంది. వదిన పద్మ రమణమూర్తి నొకరోజు నిలదీసింది.

"ఏమండీ! మీరు వేరే ఆమెతో తిరుగుతున్నారని తెలిసింది. ఆమెకు, నాకు అన్యాయం చేయకండి అది ఇద్దరకు అన్యాయమే!"

"నీకు అన్యాయం అయితే అవవచ్చును. కాని ఆమెకి అన్యాయం కాదు", "భార్య బతికున్న మీరు ఆమెను ఎలా పెళ్ళి చేసుకోగలరు? పెళ్ళి చేసుకోకుండా ఆమెతో తిరగటం తప్పుకాదా? ఏ కడుపోవస్తే అన్యాయమైపోదా ఆమె?"

"అవదు, నేను పెళ్ళి చేసుకొంటాను"

"ఎలా చేసుకుంటారు - నాకు విడాకులివ్వందే?"

"ఇస్తాను"

"నేను ఇవ్వను"

"ఇస్తావు. నీకు మొగుడి మీద ఏ మాత్రం ప్రేమున్నా ఇస్తావు - నీ కింక పిల్లలు పుట్టరని నీకు తెలుసు. నాకు కూతురు కావాలి" రమణమూర్తి మొండిగా వాదించసాగాడు.

"పెంచుకుందాం"

"నాకు పుద్దారు కదా! నేను పెంచుకోవడానికి ఇష్టపడను".

పద్మ వాదన ఆపి ఆ గదిలోంచి ఏడుస్తూ వెళ్ళిపోయింది.

సుధాకర్ అంతా వింటూనే ఉన్నాడు.

"అన్నయ్యా! వదిన నీకు విడాకులివ్వనంటోంది విన్నావు కదా!"

"ఇమ్మని ఒప్పించు. ఇచ్చినా ఇక్కడే ఉండవచ్చు. లీగల్‌గా విడిపోదాం అని మాత్రమే అంటున్నాను. ఇంట్లోంచి పొమ్మనటం లేదు"

"వదిన అంత పతివ్రత అనుకోను"

"మానెయ్యమను. ఇప్పట్లాగానే ఆమెతో మరో ఇంట్లో ఉంటాను"

"బైగమీ నేరం" - సుధాకర్ కోపంగా అన్నాడు.

"పెళ్ళి చేసుకుంటే నేరం ఆమెను పెళ్ళిచేసుకోను. అయినా మగవాడు పాలిగమస్. జంతువుల్లో చూడు. మనుష్యుల్లో ఈ కట్టుబాట్లు కృత్రిమం వివాహవ్యవస్థ మనుష్యులు కల్పించుకొన్నది."

సుధాకర్ జవాబు చెప్పాడు అన్నయ్యకు.

"జంతువుల్లో మగజంతువు ఎన్నో ఆడజంతువులకి సంతానం కంటుంది. కాని అది దాని మందని కాపాడడానికి ప్రాణాలొడ్డి పోరాడుతుంది. ఓడిపోతే గెలిచిన మగ జంతువుతో మందంతా వెళ్ళిపోతుంది. ఓడిన దాని చావు దాన్ని చావమని. తనకంటే బలమైన మగవాడికి తన స్త్రీలని అప్పగించటానికి ఇష్టపడని మగవాళ్ళందరు చేరి మనుష్యుల్లో వివాహవ్యవస్థ ఏర్పరిచారు. ఒక పురుషునికి ఎంతమంది భార్యలుండవచ్చును? ఒక స్త్రీకి ఎంతమంది భర్తలుండవచ్చును? అనే విషయంలో ఎన్నో సంవత్సరాల సంఘర్షణ ఫలితంగా 'ఒకరి కొక్కరే' అన్న సూత్రం ఏర్పడింది. 'ధర్మార్థ కామాల విషయంలో తప్పి చరించను' అంటూ వాగ్దానాలు, నమ్మించడాలు మొదలయ్యాయి. ఒకరి నొకరు మచ్చిక చేసుకునే వ్యవస్థ ఏర్పడింది. ఇద్దరిలో బలవంతులు రెండోవారిని నమ్మించి మోసం చేయడం ఈ వివాహ వ్యవస్థలో జరుగుతూనే ఉంది. మనం జంతువుల ఉదాహరణలు మన అవసరాలకిస్తూ ఉంటాం. నచ్చని వాటిని పాశవిక లక్షణాలంటూ ఉంటున్నాం. పశువుల్లో మోసం లేదు, దగా లేదు. వదినని నువ్వు ప్రేమించానని చెప్పావు. ఆమెని పెళ్ళి చేసుకుని భద్రతా భావం కలిగించావు. మేకను పెంచావు. దానికి మేత వేస్తూ భద్రతా భావం కలిగించావు. నీ అవసరానికి మేక గొంతు కోసినట్టే వదిన గొంతుకను నీ అవసరానికి కొయ్యడానికి సిద్ధపడ్డావు. అన్నయ్యా! ప్రకృతి సిద్ధమైన వాటిని పూర్తిగానైనా అంగీకరించాలి. లేక మనుష్యులం మనంతట మనం ఏర్పరచుకొన్న నియమాలనైనా మనం పాటించాలి. నువ్వు రెండూ చెయ్యటం లేదు."

రమణమూర్తి అవాక్కై సుధాకర్ కేసి ఆశ్చర్యంగా చూడసాగాడు. సుధాకర్ మాట్లాడుతుంటే వచ్చి నిలబడిన పద్మ అతని మాటలు విని, "నీకెందుకు సుధాకర్ ఈ కంఠశోష. ఆయనకు నేనక్కర్లేకపోతే ఆయనని పట్టుకొని వేళ్ళాడను. ఇందాక ఏదో కొద్ది ఆశలో విడాకులు ఇవ్వనన్నాను. విడాకులూ ఇస్తాను - ఇంట్లోంచీ వెళ్ళిపోతాను".

"విడాకులిస్తే చాలు పద్మా! నువ్వు ఇల్లు విడిచి వెళ్ళాల్సిన పని లేదు. ఆమెకు గౌరవమైన స్థానం కల్పించటానికి ఆమెతో పెళ్ళి, నువ్వెప్పట్లా ఈ ఇంట్లో ఉండవచ్చు" అన్నాడు రమణమూర్తి.

"ఇప్పుడు నేను పెళ్లాన్ని. ఆమె ఉంపుడు కత్తె. రేపు ఆవిడ పెళ్ళాం. నేను ఉంపుడు కత్తెనీ అన్నమాట. నాకు మాత్రం ఆ అగౌరవం ఎందుకు! నేను వెళ్ళిపోతాను" అంది పద్మ. పద్మ మాటలు ధృఢంగా వచ్చాయి.

కాసేపు నిశ్శబ్దం ఆవరించుకొంది. రమణమూర్తి తల్లీ, తండ్రీ ఎటూ చెప్పలేక మొదటి నుంచి ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నారు. కొడుకునేమన్నా అంటే ముసలి తనంలో వాళ్ళ జీవితాలు గడవవేమో అన్న భయం. కోడలి ననటానికి ఆమె తప్పేమీ లేదు. సిద్ధూ "నేను అమ్మతో వెళ్ళిపోతాను" అన్నాడు. తల్లికి జరుగుతున్న అన్యాయం ఆ పిల్లవాడికి అర్థమైంది.

సుధాకర్ "పద్మా!" అని సంబోధించాడు.

మరిది తనని 'వదినా!' అని కాక 'పద్మా!' అని పిలుస్తే ఆమె ఆశ్చర్యపోయింది.

"నువ్వు అన్నయ్యకి విడాకులివ్వటానికి నిశ్చయించుకున్నావు కనుక అడుగుతున్నాను పద్మా! నువ్వు నన్ను పెళ్ళి చేసుకొంటావా?" అని అడిగాడు సుధాకర్ ఇంట్లో అందరి నెత్తినా పిడుగు పడింది. "ఎంత మాటన్నావురా! భ్రష్టుడా! వదిన తల్లితో సమానం అని తెలియదా!" అంది కోపంగా తల్లి.

"అన్నయ్య విడాకులిచ్చాక నాకామె వదిన ఎలా అవుతుంది? వదిన కాని పద్మ తల్లి ఎలా అవుతుంది? వివాహ వ్యవస్థ అనేది మనిషి కనిపెట్టినది. ఆమెను నేను పెళ్ళి చేసుకోవటం తప్పుకాదు. అది తప్పు కాకపోవటం జంతువుల్లోనే కాదు, మనుష్యుల్లో కూడా తప్పుకాదు. దేవరన్యాయం పేరిట మన శాస్త్రాలు ఒప్పుకొంటాయి" అన్నాడు సుధాకర్.

"ఎంత మాటన్నావ్ సుధాకర్! నేను నీకంత చులకనైపోయానా?" అంది పద్మ బాధగా.

"చులకనకాదు. నువ్వంటే నాకు గౌరవం.

లీగల్‌గా పెళ్ళిచేసుకొందాం. ఈ ఇంట్లో నాకూ వాటా ఉంది. మనం ఇక్కడే ఉండవచ్చు"

"నేను తలెత్తుకు తిరగటం నీకిష్టం లేదన్నమాట" అని అరిచాడు రమణమూర్తి కోపంగా, ఆలోచించకుండా.

"నువ్వు చేస్తున్న పనికి, చేయబోతున్న పనికి తలెత్తుకు తిరగగలిగిన వాడివి నేను చేస్తానన్న పనికి తలెందుకు దించుకోవాలి? నువ్వు ఆ రెండో ఆమెకి గౌరవస్థానాన్ని కల్పిస్తానంటున్నావు. నేను పద్మకి గౌరవస్థానం కల్పిస్తానంటున్నాను. నువ్వు వదినకి విడాకుల్వికుండా మా పెళ్ళి ఆపగలవుగాని మరోలా కాదు. వదిన తల్లి లాంటిదని నాతో ఎవరూ 'మచ్చిక' మాటలు చెప్పకండి" అంటున్న సుధాకర్ కేసి పద్మ కృతజ్ఞతతో చూసింది.